సాక్షి ప్రకాశం

ఆదివారం । 17 । ఆగస్టు । 2025



పశువుల అపహరణ ముఠా అరెస్టు

పశువులను అపహాకరించి సంతల్లో అమ్ముతున్న ఏడుగురుని మద్రిపూడి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు ట్రాలీ వాహనాలు, రూ.4.55 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. - 8లో..



పుస్తకాల పండుగ

ఏడేళ్ల తరువాత ఒంగోలు నగరంలోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 24వ తేదీ వరకు పుస్తకాల ప్రదర్శన నిర్వహిస్తారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

గొప్పనేత సర్దార్ గౌతు లచ్చన్న



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఒంగోలు వన్‌టౌన్: సర్దార్‌గా ఖ్యాతి గడించిన స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల పెన్నిధి, రైతు బాంధవుడు, కార్మిక శ్రేయోభిలాషి అయిన గొప్ప నేత సర్దార్ గౌతు లచ్చన్న అని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వరరావు అన్నారు. గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలను ఒంగోలు బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంకితభావంతో ఎన్నో ఉద్యమాలు నడిపిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యదక్షత, ఉక్కు సంకల్పం వలనే ఆయనకు సర్దార్ అనే పేరు వచ్చిందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి ఎగిసిపడిన రాజకీయ కెరటమన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం పదవులను సైతం త్యాగం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా గౌతు లచ్చన్న చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగాసన జిల్లాస్థాయి పోటీలు

ఒంగోలు: జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఈనెల 17న స్థానిక అంజయ్య రోడ్డులోని ఏకేవీకే విద్యాకేంద్రం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం అధ్యక్ష, కార్యదర్శులు బోయపాటి రవి, సోమ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. 9 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు సబ్ జూనియర్స్, 14పైన 18 మధ్య వయస్సు ఉన్నవారు జూనియర్స్, 18పైన 28 మధ్యవయస్సు ఉన్నవారు సీనియర్స్‌గా పరిగణిస్తారు. 28 ఏళ్లకు పైబడిన వారికి ట్రెడిషనల్ యోగాసనాల్లో మాత్రమే పోటీలు ఉంటాయి. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 7780680121 లేదా 9490163312 లను సంప్రదించాలని అధ్యక్ష, కార్యదర్శులు బోయపాటి రవి, సోమ సుబ్బారావు పేర్కొన్నారు.

సత్తాచాటిన గుంటూరు జిల్లా ఎడ్లు

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లు 3752 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. కంభం మండలం దరగకు చెందిన సిద్దన కళ్యాణ్ ఎడ్లు 3750 అడుగులు, వైఎస్సార్ జిల్లా పాలూరుకు చెందిన కే హేమలతారెడ్డి ఎడ్లు 3500 అడుగులు, బేస్తవారిపేట మండలం బసినేపల్లెకు చెందిన వెనిగండ్ల శ్రీనివాసులు ఎడ్లు 3500 అడుగులు, పల్నాడు జిల్లా బయ్యవరానికి చెందిన కడియం మణికంఠ ఎడ్లు 3455 అడుగులు, గిద్దలూరు మండలం అక్కలరెడ్డిపల్లె కుతుర్ల దీక్షిత్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి ఎడ్లు 3269, పల్నాడు జిల్లా అడవిపాలెం పాకల శ్రీనివాసులు ఎడ్లు 3255, రాచర్ల మండలం అక్కపల్లె మండలం బత్తుల భూపాల్ ఎడ్లు 3051, ప్రకాశం జిల్లా గురువారెడ్డిపాలేనికి చెందిన వాకా సుబ్బారెడ్డి ఎడ్లు 3 వేల అడుగులు, అవుకు మండలం సంకేసులకు చెందిన సగబాలి ఆంతోనమ్మ ఎడ్లు 3 వేల అడుగుల దూరం లాగి వరుసగా ఒకటి నుంచి పది స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి పది బహుమతులు వరుసగా రూ.20 వేలు, రూ.16 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3, రూ.2500, రూ.2 వేలను దాతలు అందజేశారు.

ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్..
శనివారం మధ్యాహ్నం 12.30..
కనిగిరి వైపు వెళ్లే ప్లాట్‌ఫాం వద్ద పెద్ద ఎత్తున మహిళలు బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. దాదాపు గంటసేపటి నుంచి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల కోసం నిరీక్షించారు. ఇక వేచిచూసే ఓపికలేక చాలా మంది మహిళలు అప్పడే వచ్చిన అల్ట్రాడీలక్స్ బస్సు ఎక్కేశారు. మరి కొందరు మాత్రం బస్సుల కోసం ఎదురు చూశారు. ఒంటిగంట సమయంలో ఎక్స్‌ప్రెస్ బస్సు వచ్చింది. 12.30 గంటల సమయంలో సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌లో 15 బస్సులు ఉండగా అందులో 8 సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఇంద్రా సర్వీసులు ఉన్నాయి.





1 కనిగిరి డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సులో సగానికి పైగా మహిళా ప్రయాణికులు కూర్చున్న దృశ్యం

2 బస్సుల కోసం మార్కాపురం బస్టాండులో వేచిచూస్తున్న మహిళలు

ఉచితం.. చక్ర బంధం!

- బస్సులు రాక మహిళల అవస్థలు
- బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు
- విసుగు చెంది దొరికిన బస్సు ఎక్కేస్తున్న మహిళలు
- జిల్లాలో 500 గ్రామాలకు బస్సుల్లేవు
- దూర ప్రయాణాలు చేసే వారికి సరిపడా లేని ఎక్స్‌ప్రెస్ బస్సులు
- రూట్ల కుదింపుతో గ్రామీణ మహిళా ప్రయాణికుల ఇక్కట్లు
- శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఒంగోలు బస్టాండ్‌లో ఉన్న 15 బస్సుల్లో 8 వరకూ సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్ బస్సులే

స్త్రీశక్తి పేరుతో కూటమి ప్రభుత్వం ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అవస్థల యానంగా మారింది. కేవలం ఐదు రకాల బస్సులకు మాత్రమే అనుమతినిచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణించవచ్చు అంటూ ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, నాయకులు చేస్తున్న హడావుడిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదిలోనే హంసపాదన్నట్లు తొలిరోజే కొన్ని రూట్లలో మహిళలు టికెట్టు తీసుకొని ప్రయాణించాల్సి వచ్చింది. ఉచిత బస్సు పథకం ప్రారంభమైందికదా అని కండెక్టర్లను అడిగితే ఇంకా చార్ట్ రాలేదన్న సమాధానం వచ్చింది. దీంతో ఎంతో ఆశతో తొలిరోజే ఉచిత బస్సు ప్రయాణం చేయాలని ఆర్టీసీ బస్సు ఎక్కిన మహిళలు విస్తుపోయారు. ఉచిత బస్సు కోసం మహిళలు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. జిల్లాలో దాదాపు 500 గ్రామాలకు బస్సు సర్వీసులు లేకపోవడం గమనార్హం.



ఒంగోలు బస్టాండ్‌లో మధ్యాహ్నం నిలిపి ఉంచిన సూపర్ లగ్జరీ సర్వీసులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించింది. రెండో రోజు శనివారం మహిళల నుంచి అంతంత మాత్రంగానే స్పందన కనిపించింది. ఒంగోలు, మార్కాపురం బస్టాండ్‌లు మినహా మిగతా ప్రాంతాల్లో రద్దీ కనిపించలేదు. కనిగిరి,గిద్దలూరు,యర్రగొండపాలెం, సంతనూతలపాడు, కొండపి, దర్శి నియోజకవర్గాల్లో బస్సులు ఖాళీగానే తిరిగాయి. ప్రభుత్వం ఈ పథకాన్ని అయితే ఆర్భాటంగా ప్రారంభించింది కానీ అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమైందని మహిళా ప్రయాణికులు ఆరోపిస్తుండడం గమనార్హం. ఉచిత బస్సు పథకం ప్రారంభమైందికదా అని కండెక్టర్లను అడిగితే ఇంకా చార్ట్ రాలేదన్న సమాధానం వచ్చింది. దీంతో ఎంతో ఆశతో తొలిరోజే ఉచిత బస్సు ప్రయాణం చేయాలని ఆర్టీసీ బస్సు ఎక్కిన మహిళలు విస్తుపోయారు. జిల్లాలో అనేక రూట్లను కుదించడంతో అయా గ్రామాల మహిళలకు ఉచిత బస్సు ఉండీ ఉపయోగం లేకుండా పోతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. పొదిలి ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్‌ఎం సత్యనారాయణకు ఊహించని విధంగా ప్రయాణికుల నుంచి చుక్కెదురైంది. అసలే బస్సులు సరిగా లేవని, గంటల కొద్దీవేచి చూసినా బస్సులు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత బస్సుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని చెప్పారు. దాంతో ప్రయాణికులకు జవాబు చెప్పలేక ఆర్‌ఎం వెనుదిరిగారు.

500లకు పైగా గ్రామాలకు బస్సుల్లేవు..

జిల్లాలో 729 పంచాయతీలు ఉన్నాయి. శివారు కాలనీలతో కలుపుకొని 1823 గ్రామాలు ఉన్నాయి. ఇందులో దాదాపుగా 500 గ్రామాలకు పైగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ఒక్క ఒంగోలు పరిసర గ్రామాల్లో 60 నుంచి 100 గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. ఏలూరివారిపాలెం, గుడిపాడు, బోడపాలెం, పిడతలపూడి రూట్లలో ఆర్టీసీ బస్సులు తిరగడంలేదు. ముప్పవారి పాలెంకు ఒకప్పుడు బస్సు సౌకర్యం ఉండేది. ఇప్పుడా సర్వీసును నిలిపివేశారు. ఇనుమలమోటూరు, గాజులపాలెం, రాయవారిపాలెం, అన్నంగి, బసవన్నపాలెం, చింతాయపాలెం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఒంగోలు డిపో నుంచి టంగుటూరు మీదుగా కామేపల్లి వెళ్లే రూట్లో 10 గ్రామాలు ఉన్నాయి. వాటికి కూడా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. నిజానికిది మెయిన్ రూటు. ఈ రూటులో ప్రయాణికులు ఎక్కువగా తిరుగుతుంటారని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. టంగుటూరు నుంచి ఆలకూరపాడు, అనంతవరం గ్రామాలకు వెళ్లాలంటే ఆటోలే దిక్కు. కనపర్తిలో గతంలో 4 బస్సులు తిరిగేవి. ఇప్పుడు కేవలం ఒక్క బస్సు సర్వీసును మాత్రమే తిప్పుతున్నారు. పొదిలి నుంచి వయా మునగపాడు మీదుగా దొనకొండకు గతంలో 8 బస్సు సర్వీసులు తిరిగేవి. ఇప్పుడు ఒక్క బస్సు సర్వీసు కూడా లేకుండా తీసేశారు. ఇది కూడా రద్దీ బాగా ఉండే మెయిన్ రూటు కావడం విశేషం. కనిగిరి డిపో పరిధిలో గానుగపెంట, బడుగులేరు గ్రామాల రూట్లో అసలు బస్సులు తిరగడం లేదు.



మార్కాపురంలో బస్సులు ఖాళీ లేక వెనుదిరిగి వెళ్తున్న మహిళలు

ఏరువారిపల్లి, పోలారం రూట్లలో కూడా ఆర్టీసీ బస్సు సర్వీసులు తిరగడం లేదు. అడ్డరోడ్డు, నల్లారెడ్డిపల్లిలకు ఆర్టీసీ బస్సులు వెళ్లవు. అడ్డరోడ్డు లోపల ఉన్న 10 గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. గిద్దలూరు మండలంలోని కొంగలవీడు, వేములపాడు, కొమ్మునూరు, నల్లగట్ల, అంబవరం, వెల్లపల్లె, వెంగళరెడ్డి పల్లె, జయరామపురం, కంచిపల్లె, అంకిరెడ్డి పల్లె, ఓబులాపురం, వెంకటాపురం, బురుజుపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపడం లేదు. కొమరోలు మండలంలో చింతలపల్లె పంచాయతీలోని అన్నీ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లవు. మండలంలోని మరో 17 గ్రామాలకు కూడా బస్సులు నడపడం లేదు. అర్ధవీడు మండలంలోని అంకభూపాలెం, ఇందిరానగర్, నారాయణ పల్లె, వీరభద్రాపురం, అయ్యావారిపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేవు. బేస్తవారిపేట చెన్నుపల్లె, బాలేశ్వరపురం, రాచర్ల మండలంలోని 10 గ్రామాలకు, కంభం మండలంలోని రావిపాడు, ఎల్ కోట, లింగోజిపల్లి గ్రామాలకు బస్సులు లేవు. మార్కాపురం పరిధిలో 34 గ్రామాలకు బస్సులు లేవు. ఈ గ్రామాలకు చెందిన మహిళలు ఉచిత బస్సు ఎక్కాలంటే ఆటోలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండల కేంద్రాలకు వచ్చి ఎక్కాల్సి ఉంటుంది. ఉచిత బస్సు సౌకర్యం జిల్లాలోని ప్రజలందరికీ అందుబాటులో లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

పుణ్యక్షేత్రాలకు ఉచితం లేనట్లే..

జిల్లా నుంచి వందలాది భక్తులు నిత్యం తిరుపతి, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తి వెళుతుంటారు. అయితే ఈ పుణ్యక్షేత్రాలకు వెళ్లాలంటే ఎక్స్‌ప్రెస్ బస్సులు చాలా తక్కువ. అధిక శాతం సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్ బస్సులు మాత్రమే ఉన్నాయి. దీంతో భక్తులు తప్పనిసరిగా టికెట్టు కొని ప్రయాణాలు చేయాల్సిందే. జిల్లాలో కూడా మాలకొండ, భైరవకోన, శింగరకొండ తదితర ఆధ్యాత్మిక కేంద్రాలకు బస్సు సౌకర్యం లేదు. దాంతో ఉచిత ప్రయాణం చేయాలన్నా ఆ అవకాశం లేదు. రాయలసీమ నుంచి కొత్తపట్నం, కరేడు, రామాయపట్నం బీచ్‌లకు ఎక్కువ మంది పర్యాటకులు వస్తుంటారు. నేరుగా ఇక్కడకు వెళ్లడానికి కూడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఉచిత బస్సు సౌకర్యం ఉన్నా ఉపయోగపడే అవకాశం లేదని చెబుతున్నారు.

మహిళలు లగ్జరీ బస్సులు ఎక్కకూడదా...

ఉచిత బస్సు సౌకర్యం కేవలం పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రమే పరిమితం చేశారు. జిల్లాలోని ఒంగోలు ఆర్టీసీ డిపోలో సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్, 4 ఏసీ బస్సు సర్వీసులు ఉన్నాయి. జిల్లాలోని మిగతా 4 డిపోలను కలుపుకొని మొత్తం 10 వరకు ఏసీ బస్సులు ఉన్నాయి. దూరప్రాంతాలకు వెళ్లే వారు, అనారోగ్యంతో బాధపడే వారు సహజంగా ఏసీ బస్సుల్లో ప్రయాణం చేయాలనుకుంటారు. అయితే ఉచిత బస్సు పథకంలో ఏసీ బస్సులను అనుమతించలేదు. మహిళలు ఏసీ బస్సులు ఎక్కడానికి అనర్హులా అని మహిళా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అలాగే సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్ సర్వీసుల్లో కూడా అనుమతించాలని డిమాండ్ చేస్తున్నాయి.

చంద్రబాబు అంటే గుర్తుకొచ్చేది వెన్నుపోటే

- ఊకదంపుడు ప్రచారంతో మోసం చేయటమే ఆయన నైజం
- బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ సభలో ఎమ్మెల్యే తాటిపర్తి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: చంద్రబాబు పేరు చెపితే అందరికీ గుర్తుకు వచ్చేది వెన్ను పోటేనని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి తాడిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం, యడవల్లిలలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఊకదంపుడు ఉపన్యాసాలు, ప్రచారాలతో ప్రజలను మోసం చేయటమే చంద్రబాబు నైజమన్నారు. ఆయన చేసిన తప్పుడు ప్రచారాలకు మద్దతు పలికిన మీడియా చానళ్లకు ఎన్నో లాభాలు, పదవులను అందించిన ఘనత చంద్రబాబు నాయుడిదేనన్నారు. అయిన వారిని అందలాలు ఎక్కించిన చంద్రబాబు నిరుపేదలకు మాత్రం పిడికిలిని విదిలిన్న పాపాన పోలేదన్నారు. గతంలో డ్వాక్రా మహిళల రుణాల మాఫీ, రైతుల రుణాల మాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు అని వారికి ఏమీ చేయని ఘనత చంద్రబాబుదేనన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయమే దండగ అన్న పెద్దమనిషి ఆయనేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఎన్నో పథకాలను అందించారని చెప్పారు. పాఠశాలను ఆధునికీకరించటంతో పాటు, వైద్యం కోసం ఎన్నో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. దీంతో పాటు 55 వేల వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగాలను భర్తీ చేశారని తెలిపారు. నేడు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో 14 వైద్యుల పోస్టుల ఖాళీలున్నాయన్నారు. పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌కు తమ ప్రభుత్వం ద్వారా డబ్బులు చెల్లిస్తే, ఆ బస్టాండ్‌ను ఆక్రమించుకోవాలని టీడీపీ నాయకులు చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పెద్దబొమ్మలాపురం తూర్పుపల్లెలో అంగన్‌వాడీ స్కూల్ ఎదుట మడుగులా మారిన స్థలాన్ని, ట్యాంకు నుంచి లీకుకు గురై వెళుతున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం బొమ్మలాపురం బ్రహ్మంగారి గుడి వద్దనున్న గిరిజనులకు నీటి సమస్య, పక్కా గృహాల సమస్యపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో మాట్లాడి వారి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు సింగా ప్రసాద్, చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, రామనారాయణరెడ్డి, చిట్టి మల్లికార్జునరెడ్డి, వెన్నా పాండు రంగారెడ్డి, చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, యక్కంటి శ్రీకాంత్‌రెడ్డి, పొందుగుల నాగమల్లేశ్వరి, అలుగుల లక్ష్మయ్య, మధు, రత్నరాజు, కొండా సురేష్, రావిక్రింది రామారావు, వెన్నా వెంకటేశ్వరరెడ్డి షెక్షావలి, లాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు సంతపేటలోని సాయిబాబా మందిరం వద్ద ఉట్టికొడుతున్న చిన్నారి



కృష్ణయ్యా.. కన్నయ్యా

కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా శనివారం జిల్లాలోని వైష్ణవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాలు, విద్యా సంస్థల్లో చిన్నారుల చేత శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు వేయించారు. యువతీ, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా ఉట్టికొట్టారు. - సాక్షి, ఒంగోలు



కేశవస్వామిపేట శివాలయం నుంచి సుబ్రహ్మణ్యేశ్వరుని కావడితో వస్తున్న భక్తులు



మేళతాళాలతో నిర్వహిస్తున్న వేల్‌కావడి మహోత్సవం



ఊరేగింపులో వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులు

వేల్ మురుగా..హరోం హర

శ్రావణ మాసం సందర్భంగా ఒంగోలులోని కేశవస్వామి పేట శివాలయంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజల అనంతరం వేల్‌కావడి నగరోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు శరీరానికి శూలాలు గుచ్చుకుని, కావడిలు మోస్తూ సుబ్రహ్మణ్యేశ్వరుని భజిస్తూ మేళతాళాలతో నగరోత్సవం నిర్వహించారు. - సాక్షి, ఒంగోలు



శూలం గుచ్చుకుని కావడి మోస్తున్న భక్తుడు

జీఓలు జారీ చేస్తారు..పాటించరు



ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో చేసిన కొండపి ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం ఏర్పాట్లు

- ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో కొండపి ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వ విద్యా సంస్థల ప్రాంగణంలో విద్యా సంస్థల కార్యక్రమాలు తప్ప ఇతర ప్రైవేటు కార్యక్రమాలు ముఖ్యంగా రాజకీయ పార్టీల కార్యకలాపాలు నిర్వహించవద్దని కూటమి ప్రభుత్వం తరఫున విద్యాశాఖాధికారులు జీఓ జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కానీ సింగరాయకొండ మండల కేంద్రంలోని ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో కొండపి వ్యవసాయ మార్కెటింగ్ యార్డు చైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా కూటమి పార్టీల నాయకుల ఫ్లెక్సీలు క్రీడా ప్రాంగణంతో పాటు కాలేజీ చుట్టుపక్కల ఏర్పాటు చేశారు. దీనికితోడు ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు మరో ముగ్గురు మంత్రులు, వివిధ రాష్ట్ర స్థాయి బోర్డు చైర్మన్‌లు పాల్గొన్నారు. వీరికి బందోబస్తు కింద దాదాపు 60కి పైగా పోలీసులను ఏర్పాటు చేశారు. ఈ కాలేజి ఆవరణ చుట్టు పక్కల పలు ప్రైవేటు విద్యా సంస్థలు, గృహాలు ఉన్నాయి. ఈ విధంగా జీఓలు వీరే ఇస్తారు.. మళ్లీ జీఓలను వీరే తుంగలో తొక్కటంపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వివరణ కోరేందుకు ఎంపీడీఓ, ఎంఈఓ, జిల్లా విద్యాశాఖాధికారిని ఫోన్ ద్వారా అడిగే ప్రయత్నం చేసినా వారు అందుబాటులోకి రాలేదు. దీనిపై వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్ రియాజ్ విస్మయం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ డొల్లతనానికి నిదర్శనమని ఆక్షేపించారు.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడు

● గంటలోనే పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ఒంగోలు టౌన్: తప్పిపోయిన బాలుడిని గంట వ్యవధిలోనే పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఒంగోలు నగరంలో శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. స్థానిక విజయనగరకాలనీకి చెందిన అన్నంపల్లి గురవయ్య కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని అన్నవరప్పాడులో ఓ వివాహానికి హాజరయ్యారు. బంధువులతో కలిసి సంతోషంగా కబుర్లు చెప్పుకున్నారు. కాసేపటి తర్వాత పెళ్లికి వచ్చిన బంధువు ఒకరిని బస్సు ఎక్కించేందుకు ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో గురవయ్య ఐదేళ్ల కుమారుడు తప్పిపోయాడు. చుట్టుపక్కల వెతికినప్పటికీ బాలుడు కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే రంగంలోకి దిగిన ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ విజయకృష్ణ, ట్రాఫిక్ ఎస్సై హనుమంతరావు, ఇతర పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలతో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా వెతకడం ప్రారంభించారు. కొద్దిసేపటికి బాలుడు లక్కీ షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న సోని షాప్ వద్ద కనిపించాడు. బాలుడిని వెంటనే తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. కుమారుడిని చూసిన తల్లి ఉద్వేగాన్ని ఆపుకోలేక కన్నీరుపెట్టుకుంది. తప్పిపోయిన బాలుడిని వెంటనే అప్పగించిన సీఐ, ఇతర పోలీసు సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తకాల పండుగ.!

● ఒంగోలులో పుస్తక మహోత్సవానికి భారీగా తరలివస్తున్న ప్రజలు
● బాలబాలికలు సైతం పుస్తకాలు కొనడానికి ఆసక్తి
● సాహిత్య సమావేశాలతో నగరంలో పండుగ వాతావరణం
● 24 వరకు పుస్తక మహోత్సవం



పుస్తక మహోత్సవంలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థినులు, వృద్ధుడు

ఒంగోలు టౌన్: నగరంలో పుస్తకాల పండుగ జరుగుతోంది. ఏడేళ్ల సుదీర్ఘకాలం తర్వాత నగరంలో పుస్తక మహోత్సవం ఏర్పాటు చేయడంతో ప్రజలు ఎంతో ఆసక్తిగా సందర్శిస్తున్నారు. ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ పుస్తక మహోత్సవానికి నగరంలోని అన్ని వర్గాల ప్రజలు, యువకులు, విద్యార్థులైన బాలబాలికలు సైతం పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మొబైల్ ఫోన్లు వచ్చాక నేటి తరంలో పుస్తక పఠనం తగ్గిపోయిందన్న ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవానికి భారీ స్పందన లభించడం నిర్వాహకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పటి వరకూ హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు మాత్రమే పరిమితమైన పుస్తక ప్రదర్శన ఒంగోలు నగరంలో కూడా ఏర్పాటు చేయడంతో ప్రజల్లో ఆసక్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. 2016 సంవత్సరంలో తొలిసారిగా ఒంగోలులో పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం రెండేళ్ల తర్వాత 2018లో రెండోసారి పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. తిరిగి ఏడేళ్ల తర్వాత ఇప్పుడు పుస్తక మహోత్సవం జరుగుతుండటంతో పండుగ వాతావరణం కనిపిస్తోంది.

అందుబాటులో లక్ష పుస్తకాలు...

పుస్తక ప్రదర్శనలో 600 మంది ప్రచురణకర్తలకు సంబంధించిన లక్ష పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎప్పుడో చిన్నప్పుడు చదివిన చందమామ కథల పుస్తకాలను కూడా ఈ ప్రదర్శనలో ఉంచడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన జార్జీ బెర్నార్డ్ షా, లియో టాల్‌స్టాయ్, డేల్ కార్నగీ, నెపోలియన్ హిల్, ఫ్యూడోర్ దోస్తోయ్‌ఎస్కీ, ఆల్బర్ట్ కాము రాసిన ఆంగ్ల సాహిత్యం పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచారు. బాలల సాహిత్యం, ఆధ్యాత్మిక గ్రంథాలు, ఆరోగ్య రక్షణకు సంబంధించిన పుస్తకాలు, కథలు, నవలలు, కవిత్వం, కెరీర్ గైడెన్స్, లా బుక్స్ ఇంకా అనేక పుస్తకాలు ప్రదర్శనలో ఉన్నాయి. జపనీస్ మాంగా కామిక్స్, పజిల్స్, యాక్టివిటీ పుస్తకాలు ఆకట్టుకుంటున్నాయి. నేషనల్ బుక్ ట్రస్ట్, అరసం, ఎమెస్కో, అన్వీక్షణి, విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్ లాంటి ప్రసిద్ధ సంస్థలతో పాటు మొత్తం 35 బుక్ స్టాల్స్ ఉన్నాయి. పుస్తకాల కొనుగోళ్లపై 10 శాతం రాయితీ కూడా ఇస్తున్నారు. ఇన్ని పుస్తకాలు ఒకేచోట దొరకడం చాలా అరుదైన సందర్భం కావడంతో విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, సాహిత్య ప్రియులు, విద్యార్థులు, యువకులు పుస్తక మహోత్సవానికి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

ప్రతిరోజూ సాహిత్య సమావేశాలు...

పుస్తక మహోత్సవాన్ని పురస్కరించుకుని మాదాల రంగారావు సాహిత్య వేదిక వద్ద ప్రతిరోజూ వివిధ అంశాల మీద సాహిత్య చర్చలు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన 100 మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, మాజీ ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పొన్నూరు శ్రీనివాసులు, చంద్రనాయక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 18వ తేదీ గ్రంథాలయాలు సమాజం అనే అంశం మీద చర్చ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 19వ తేదీ పాటల జయరాజ్‌తో ముఖాముఖి, 20న చలం రచించిన స్త్రీ నవల వచ్చి 100 ఏళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని చర్చ ఏర్పాటు చేశారు. 21వ తేదీ ప్రముఖ జర్నలిస్టు తెలకపల్లి రవి రచించిన 6 పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. అదేరోజు సాయంత్రం 6 గంటలకు తల్లిదండ్రులు, పిల్లలు, ఉపాధ్యాయులు, చదువులపై వీరి పాత్ర అంశంపై చర్చ ఏర్పాటు చేశారు. 24న ముగింపు సభ జరగనుంది. దీంతో పాటు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించే విధంగా జనచైతన్య వేదిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి.

తల్లిదండ్రులు చిన్నారులను ప్రోత్సహించాలి



చాలా రోజుల తర్వాత ఒంగోలు నగరంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం సంతోషం కలిగించింది. అందుకే నేను నా కూతురితో కలిసి వచ్చాను. తనకు పుస్తకాలను పరిచయం చేయడంతో పాటు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించాలన్నదే నా ఆలోచన. తల్లిదండ్రులు తమ పిల్లలను పుస్తకాల పండుగకు తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉంది. మొబైల్ ఫోన్లకు అలవాటైన పిల్లలు పుస్తకాలకు దూరమవుతున్నారు. ఇది ఎంతమాత్రం మంచి పరిణామం కాదు. పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు చేయడం వలన వారికి మంచి వ్యక్తిత్వం ఇచ్చినవాళ్లమవుతాం. ప్రపంచ జ్ఞానాన్ని పరిచయం చేసినట్లవుతుంది.

– ఎస్.యామిని, ఉపాధ్యాయురాలు

సరికొత్త ఆలోచనలను ప్రేరేపించేది పుస్తకాలే



పుస్తకాలు చిన్నారులలో సరికొత్త ఆలోచనలను ప్రేరేపిస్తాయి. భావవ్యక్తీకరణకు భాష ఎంత అవసరమో సమసమాజ నిర్మాణానికి పుస్తకాలు అంతే అవసరం. ఒంగోలు లాంటి నగరంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఇలాంటి పుస్తక ప్రదర్శనలను ఎప్పుడో ఒకసారి కాకుండా తరచూ ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పుస్తక మహోత్సవాలు నిర్వహించాలి. తల్లిదండ్రులు స్వయంగా గ్రంథాలయాలకు వెళ్లడమే కాకుండా చిన్నారులను కూడా తీసుకెళ్లడం ద్వారా వారిలో చదవాలన్న ఆకాంక్ష పెరుగుతోంది. పుస్తకాలు చదవడం వలన పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. శాస్త్రీయ ఆలోచనలు వస్తాయి.

– నజీర్ బాషా, వ్యాపారి

న్యాయస్థానాల్లో పోస్టుల భర్తీకి పరీక్షలు

● 20 నుంచి 3 షిఫ్టుల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు
● జిల్లాలో ఐదు సెంటర్ల ఎంపిక
● పరీక్షలు పూర్తి పారదర్శకం, పుకార్లు నమ్మవద్దు
● జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం వివిధ న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టెనోగ్రాఫర్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, ఫీల్డు అసిస్టెంట్లు, ఎగ్జామినర్లు, కాపీయిస్టులు, డ్రైవర్లు, రికార్డు అసిస్టెంట్లు, ప్రాసెస్ సర్వీస్‌లు, అటెండర్ల నియామకానికి ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. కంప్యూటర్ ఆధారితంగా జరిగే పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఐదు సెంటర్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఒంగోలులో నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సొసైటీ యాక్షన్ ఇండియా (మామిడిపాలెం), బ్రిలియంట్ కంప్యూటర్స్ (భాగ్యనగర్-కేబీ రెస్టారెంట్ ఎదురుగా), రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ (వల్లూరు), కృష్ణ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (మార్కాపురం), డాక్టర్ శామ్యూల్ జార్జి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ (మార్కాపురం) సెంటర్లలో పరక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. రిపోర్టింగ్ సమయాన్ని క్షుణ్ణంగా పరిశీలించుకుని పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షలు ప్రతిరోజూ మూడు షిఫ్టులలో జరుగుతాయని, అందువలన అభ్యర్థులు వారికి హాల్ టికెట్‌లో కేటాయించిన సమయం ప్రకారం సకాలంలో హాజరుకావాలని వివరించారు. నియామకాలు పూర్తిగా హైకోర్టు ఆదేశాల ప్రకారం, నియామక పరీక్షల ఫలితాల ఆధారంగా మాత్రమే జరుగుతాయని, ఎటువంటి అవినీతికి తావులేదని స్పష్టం చేశారు. ఎటువంటి పైరవీలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నియామకాలు జరుగుతాయని, అభ్యర్థులు ఎటువంటి పుకార్లను, మధ్యవర్తులను నమ్మవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి సూచించారు.

ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ

● మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: ఇటీవల జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీ చేసిందని మాజీ ఎమ్మెల్యే మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు విమర్శించారు. శనివారం ఆయన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్, పోలీసులు, పోలింగ్ సిబ్బంది అధికార పార్టీతో కుమ్మక్కవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టే అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన వీడియో, ఫొటోల సాక్షిగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు దొంగఓట్లు వేస్తూ పట్టుబడ్డారన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యం వర్ధిల్లిందంటూ మంత్రి లోకేష్ చేసిన ట్వీట్ వీడియోలోనే దొంగ ఓటర్లున్నారన్నారు. పోలింగ్ బూత్‌ను ఆక్రమించుకున్న మంత్రి రామప్రసాద్‌రెడ్డిపై ఇప్పటి వరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఏజెంట్లనే కాక కనీసం వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులను కూడా ఓట్లు వేయనీకుండా తీవ్ర అక్రమాలకు పాల్పడి ఎన్నికల్లో గెలవడం సిగ్గుచేటని అన్నారు. ఎన్నికల నిర్వహణపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించిందని, ఈ నేపథ్యంలో హడావుడిగా కూటమి ప్రభుత్వం ఓట్ల లెక్కింపు కోసం ఎక్కువ టేబుళ్లను వేసి ఎన్నికల ఫలితాలను ప్రకటించడం విడ్డూరమన్నారు. పులివెందులలో టీడీపీకి 6,716, వైఎస్సార్ సీపీకి 683 ఓట్లు వచ్చాయంటే రిగ్గింగ్ లెక్కలే చెబుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు నిజంగా అంతటి ప్రజాబలం ఉందని అనుకుంటే ఇన్ని అక్రమాలు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందన్నారు. ఈనెల 5న పులివెందులలో ప్రచారం కోసం వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పై, వైఎస్సార్ సీపీ నాయకుడు వేల్పుల రాముపై దాడిచేసి హత్యచేయడానికి ప్రయత్నించారని, కారుపై పెట్రోల్ పోసి తగులబెట్టి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ఈ దాడిలో గాయపడి చావుబతుకుల మధ్య ఉన్న రాముపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ మరీ విడ్డూరంగా పక్కగ్రామంలో పత్తివ్యాపారం ఏంటని, ఇంకా మేం ఉండబట్టే తలలు పగిలాయి, లేదంటే తలలు తెగిపడేవి అని బాధ్యతా రహితంగా మాట్లాడటం ఐపీఎస్ అధికారికి తగదన్నారు. పులివెందులలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్ రెడ్డిని కనీసం ఓటు వేయనీయలేదని, ఆరోజు తెల్లవారుజామున నుంచే హౌస్ అరెస్టు చేశారని అన్నారు. అధికారపక్ష అభ్యర్థిని మాత్రం స్వేచ్ఛగా వదిలేశారన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్థానికుడైనా తెల్లవారుఝామున నుంచే ఆయన ఇంటికి వెళ్లి కనీసం చెప్పులు కూడా వేసుకోనివ్వకుండా, ఆరోగ్యం బాగోలేదని చెబుతున్నా వినకుండా రెండు చేతులను పట్టుకుని లాక్కుని వచ్చారన్నారు. యూనిఫాం వేసుకున్న పోలీసులు ప్రజలను రక్షించడానికా.. పాలకులు చెప్పింది చేయడానికా.. అని ప్రశ్నించారు. ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చిన టీడీపీ గూండాలకు పోలీసులు బాసటగా నిలిచారని, ఓట్లు వేసేందుకు బయలుదేరిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను అడ్డుకుని వారి స్లిప్పులు లాక్కున్నా పోలీసులు మాత్రం నోరు మెదపలేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తూ అత్యంత దారుణంగా నిర్వహించిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దుచేసి కేంద్ర బలగాల ఆధ్వర్యంలో తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

జేవీవీ రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



జేవీవీ రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర మహాసభల పోస్టర్లను శనివారం ఒంగోలులో ఆవిష్కరించారు. సెప్టెంబర్ 13, 14 తేదీల్లో విజయనగరంలో జరగనున్న రాష్ట్ర 18వ మహాసభలను జయప్రదం చేయాలని జేవీవీ సీనియర్ నాయకుడు ఏపీ పుల్లారావు పిలుపునిచ్చారు. నగరంలోని ఎల్బీజీ భవనంలో గల జేవీవీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలలో శాస్త్రీయ సమాజం ఏర్పాటే లక్ష్యంగా గత 38 ఏళ్లుగా జేవీవీ పనిచేస్తోందని తెలిపారు. మూఢ నమ్మకాల వలన సమాజ ప్రగతి నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సైన్స్ ఆధారంగా ఆలోచన చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు, యువకులు సమాజ చైతన్యం కోసం జేవీవీలో భాగస్వాములు కావాలని కోరారు. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీహెచ్ జయప్రకాష్, యు.భాస్కర్ మాట్లాడుతూ అందరికీ మెరుగైన విద్య, నాణ్యమైన వైద్యం అందాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులు, పాఠశాల విద్యార్థులలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.దేవప్రసాద్, ఏ విశ్వరూపం, ఎస్వీ రంగారెడ్డి, ఎస్టీ వెంకటేష్, జె.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాకు అవమానం

● కె.అగ్రహారంలో సచివాలయ సిబ్బంది నిర్వాకం
● శుక్రవారం ఎగురవేసిన జెండాను తియ్యకుండా నిర్లక్ష్యం
● కిందపడిన జాతీయ జెండా



కె.అగ్రహారం సచివాలయం వద్ద కింద పడి ఉన్న జాతీయ జెండా

పొన్నలూరు: మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో సచివాలయ సిబ్బంది నిర్వాకంతో జాతీయ జెండాకు అవమానం జరిగింది. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామ సచివాలయ భవనం వద్ద సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు జాతీయ జెండా ఎగురవేశారు. సాయంత్రం 5 గంటల తర్వాత జెండా తీసి భద్రపరచాల్సి ఉండగా, అలా చేయకుండా మర్చిపోయి వదిలేశారు. దీంతో శనివారం ఉదయం జెండా కిందపడిపోయి ఉంది. శనివారం కూడా కార్యాలయాలకు సెలవు కావడంతో సిబ్బంది విధులకు రాలేదు. దీంతో కిందపడిన జెండా మట్టిలో అలాగే ఉంది. సిబ్బంది నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస దేశభక్తి, బాధ్యత లేకుండా సచివాలయ సిబ్బంది వ్యవహరించడాన్ని విమర్శిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శిగా రవీంద్రరెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర పంచాయతీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ముల్లంగి రవీంద్రరెడ్డిని నియమించారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు.

పశువుల అపహరణ ముఠా అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్..

● ఏడుగురిని అదుపులోకి తీసుకున్న మద్దిపాడు పోలీసులు
● నాలుగు ట్రాలీ వాహనాలు, ఒక ద్విచక్ర వాహనం, రూ.4.55 లక్షల నగదు స్వాధీనం



నిందితులతో మద్దిపాడు ఎస్ఐ రమేష్‌బాబు



నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న గేదెలను అక్రమంగా తరలించిన ట్రాలీ వాహనాలు

మద్దిపాడు: పశువులను అపహరించి సంతల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్న ముఠాను మద్దిపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ రమేష్‌బాబు ఆ వివరాలు వెల్లడించారు. పొదిలి, మద్దిపాడు, చీమకుర్తి, కొండపి, కొనకనమిట్ల తదితర మండలాల్లో మేత కోసం పొలం వెళ్లిన పశువులను ట్రాలీ వాహనాల్లో ఎక్కించి అక్రమంగా తరలిస్తున్నారు. ఆ సమయంలో ఎవరైనా అడ్డొస్తే వారిపై మారణాయుధాలతో దాడి చేస్తున్నారు. అపహరించిన పశువులను గుట్టుచప్పుడు కాకుండా ఇతర జిల్లాల్లోని పశువుల సంతకు తరలించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నాళ్లుగా ఇలాంటి పశువుల అపహరణ సంఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి.

మద్దిపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఘటనలు...

మద్దిపాడు మండలంలోని గుండ్లసముద్రం, మద్దిపాడు, కూచిపూడి, రేగలగడ్డ తదితర గ్రామాల్లో వరుసగా పశువుల అపహరణ ఘటనలు చోటుచేసుకున్నాయి. దాంతో పాటు చుట్టుపక్కల మండలాల్లోని అనేక గ్రామాల్లోనూ పశుపోషణే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న వారికి చెందిన పశువులు అపహరణకు గురయ్యాయి. పశుపోషకులు వారి పశువులను మేత కోసం ఆయా గ్రామాల పరిసరాల్లోని బీడు భూములకు తోలతారు. అనంతరం వాటికి ఎవరూ కాపలా ఉండరు. మేత మేయడం పూర్తయిన తర్వాత సాయంత్రానికి వాటంతట అవే ఆయా గ్రామాల్లోని యజమానుల నివాసాలకు చేరుకుంటాయి. దీన్ని ఆసరాగా చేసుకుని పశువుల అపహరణ ముఠా రెచ్చిపోయింది.

దొంగలే పశుకాపరుల అవతారమెత్తి...

పశుకాపరులెవరూ లేకుండా బీడు భూముల్లో మేతమేస్తూ మందలుగా ఉన్న పశువులను దొంగలు గుర్తిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా ఎవరూ లేని సమయం చూసి ఓ పథకం ప్రకారం పశుకాపరుల అవతారమెత్తి దాదాపు 2 కిలోమీటర్ల దూరం వాటిని తోలుకుపోతారు. అక్కడ ఓ పథకం ప్రకారం ముందే సిద్ధంగా ఉంచిన ట్రాలీ వాహనాల్లో బలవంతంగా పశువులను ఎక్కిస్తారు. నేరుగా ఇతర జిల్లాల్లోని సంతకు తరలిస్తారు. వాటిని సంతలో అమ్మి వచ్చిన సొమ్ముతో జల్సా చేసుకుంటారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా కొన్నాళ్లు వేచి ఉండి ఆ తర్వాత మళ్లీ పశువుల అపహరణకు పాల్పడతారు. గ్రామాల్లో తిరుగుతూ అదును చూసి పశువులను మాయం చేస్తూ ఉంటారు. పశువులను కోల్పోయిన వారు వాటి జాడ కోసం వెతికీవెతికీ వేసారిపోతుంటారు. ఇలా అదృశ్యమవుతున్న పశువుల సంఖ్య క్రమంగా పెరిగిపోవడంతో బాధిత పశుకాపరులంతా ఏకమై తమ పశువుల జాడ చూపాలంటూ పోలీసులను ఆశ్రయించారు.

సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన పోలీసులు...

మద్దిపాడు మండలంలోని గ్రామాల్లో పశువులు అపహరణకు గురవుతూ బాధిత పశుపోషకుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడంతో సాక్షి దినపత్రికలో గత జూలై 25వ తేదీ పశువుల అపహరణ శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో గత శుక్రవారం రాత్రి మద్దిపాడు మండలంలోని రేగలగడ్డ సమీపంలో చెరువు కట్ట వద్ద అనుమానాస్పదంగా తారసపడిన పశువుల తరలించిన వాహనాలను స్వాధీనం చేసుకుని విచారించారు. తద్వారా అనుమానితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

కొనకనమిట్లకు చెందిన నలుగురు, పొదిలికి చెందిన ముగ్గురు నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో పోలీసులు విచారించడంతో పశువులను అపహరించింది తామేనని వారు అంగీకరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న నాలుగు ట్రాలీ వాహనాలు, ఓ ద్విచక్ర వాహనంతో పాటు పలు మారణాయుధాలు, రూ.4.55 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితులను పొదిలి కోర్టులో హాజరుపరచనున్నట్లు మద్దిపాడు ఎస్ఐ టీ రమేష్‌బాబు తెలిపారు.